ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు కార్యకలాపాలు

# ANDHRA PRADESH
# LEGISLATIVE COUNCIL DEBATES

అధికార నివేదిక

**OFFICIAL REPORT**

మంగళవారము, జూలై 17, 2007

**1వ శా. ప. II స. వాల్యూం -- II నంబరు --1**

శక సంవత్సరము - 1929, ఆషాఢం - 26

**TUESDAY, THE 17th JULY, 2007**

**1 L.C. I I S. VOL-- I I No. - 1**

**26 - Ashadh, 1929 - S.E.**

#

శాసన పరిషత్తు సచివాలయము

పబ్లిక్ గార్డెన్స్

హైదరాబాదు - 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | డా. ఎ. చక్రపాణి |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పాలడుగు వెంకటరావు |
| | | శ్రీ మహమ్మద్ జానీ |
| | | శ్రీమతి పుల్లా పద్మావతి |
| | | శ్రీ పి. యాదగిరి |
| కార్యదర్శి | : | శ్రీ కె. తుల్జానంద్ సింగ్ |
| అదనపు కార్యదర్శులు | : | శ్రీ కె. గోపాలకృష్ణయ్య |
| | | శ్రీ ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శులు | : | శ్రీ ఎన్. అంజయ్య |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ డి.శివరావు |
| | | శ్రీ ఎం. పాండురంగాచార్య |
| | | శ్రీ ఎం.వి.వి.సత్యానందం |
| | | శ్రీ పి. సీతారాములు |
| | | శ్రీ కె.ఎ.నర్సింహరాజు |
| | | శ్రీ డి. నర్సింహులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి.సత్యనారాయణ |
| | | శ్రీ కె. సుభాష్ చంద్రబోసు |
| | | శ్రీ కె. తులసీరాం |
| | | శ్రీ డి. సత్యనారాయణ |
| | | శ్రీ ఎ. రామిరెడ్డి |
| | | శ్రీ టి. రామచందర్ |
| | | శ్రీమతి వి. గిరిజా సుందరి |
| | | శ్రీ ఎస్. జయరాం |
| | | శ్రీ ఎన్.కె.బెంజమిన్ |
| | | శ్రీ కె. జగన్నాధరావు |
| | | శ్రీ మహ్మద్ జహీరుద్దీన్ |
| | | శ్రీమతి ఎ.సాయిలక్ష్మి |
| | | శ్రీ ఎం. నాగూరామ్ |
| | | శ్రీమతి పి.సుబ్బమ్మ |
| | | శ్రీమతి ఎస్.ఎ.జ్యోతి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి టి.సుశీల |

--------

ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు చర్చలు
అధికార నివేదిక

(మొదటి శాసన పరిషత్తు )
(రెండవ సమావేశము : మొదటి రోజు )
మంగళవారము, జూలై **17, 2007**
సభ ఉ. గం. **10.00** లకు ప్రారంభమైనది
( గౌ. ఛైర్మన్ అధ్యక్ష స్థానములో వున్నారు )

----------

# విషయ సూచిక

**1.** సంతాప తీర్మానము
భారత మాజీ ప్రధాని శ్రీ చంద్రశేఖర్ గారి మృతి పట్ల

---------

## సంతాప తీర్మానము
## భారత మాజీ ప్రధాని శ్రీ చంద్రశేఖర్ గారి మృతి పట్ల

CHAIRMAN: Hon'ble Chief Minister may move the motion.

డా.వై.ఎస్.రాజశేఖరరెడ్డిః అధ్యక్షా, జూలై 8వ తారీఖున భారత మాజీ ప్రధాని శ్రీ చంద్రశేఖర్‌గారి మృతిపట్ల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసిన కార్యక్రమం చేయవలసి ఉంది కాబట్టి ఈ తీర్మానాన్ని ప్రతిపాదించవలసి వస్తుంది.

"భారత మాజీ ప్రధాని శ్రీ చంద్రశేఖర్‌గారి మృతిపట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేస్తూ వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.''

అధ్యక్షా, మాజీ భారత ప్రధాన మంత్రి, ప్రముఖ పార్లమెంటేరియన్ శ్రీ చంద్రశేఖర్‌గారు ఈ నెల 8వ తారీఖున ఉదయం 8.45 ని.లకు తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 80 సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శ్రీ చంద్రశేఖర్‌గారు కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. 1927వ సంవత్సరం జూలై 1వ తేదీన ఉత్తరప్రదేశ్ లోని బలియా జిల్లాలో ఇబ్రహీంపట్టి అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన శ్రీ చంద్రశేఖర్‌గారు దేశ ప్రధానిగా అత్యున్నత స్థాయికి ఎదిగారు. శ్రీ చంద్రశేఖర్‌గారు ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి కేవలం స్వయంకృషితో రాజకీయాలలో తనదైన ఒక ప్రత్యేక శైలితో సోషలిస్టు ప్రేపరణతో ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారు. 1990 నవంబరు 10వ తేదీన రాజీవ్‌గాంధీగారి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ మద్ధతుతో మన దేశానికి పదకొండవ ప్రధానిగా మైనారిటీ ప్రభుత్వాన్ని స్థాపించారు. నాలుగు మాసాలు ప్రధానిగా ఉన్న తరువాత అవిశ్వాస తీర్మానం ద్వారా ఓడించబడి అపద్ధర్మ ప్రధానిగా మూడు మాసాలు కొనసాగారు. మొత్తం ఎనిమిది సార్లు లోక్‌సభకు, ఒకసారి రాజ్యసభకు ఎన్నికై భారత పార్లమెంటుద్వారా భారత ప్రజాస్వామ్యానికి సేవలందించారు. ఆయన ఒకసారి మాత్రమే ఓడిపోయారు. మిగిలిన ఎనిమిది సార్లు లోక్‌సభ సభ్యులుగా వారు గెలిచారు.

తాను నమ్మిన సోషలిస్టు సిద్ధాంతం కోసమై అహర్నిశలు కృషిచేశారు. పేద, బడుగు వర్గాలవారిని అన్నివిధాల అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లడానికి కృషి చేసిన వ్యక్తి శ్రీ చంద్రశేఖర్‌గారు. పార్లమెంటరీ సాంప్రదాయాలను పాటించడంలో ఆయన అందరికీ ఒక రోల్ మోడల్ అనిపించుకున్నారు. శ్రీ చంద్రశేఖర్‌గారు మనసా, వాచా, కర్మణా నిజమైన లౌకికవాది అనిపించుకున్నారు. బడుగు, బలహీనవర్గాలకోసం సాంఘిక మార్పును ఆశిస్తూ ప్రజాస్వామ్య పరిపాలన అందించగల సోషలిస్టు విధానాలు అమలులోకి తేవాలని ఆయన తపించేవారు. ఇవాళ మన మధ్య శ్రీ చంద్రశేఖర్‌గారు లేకపోయినా మరణం మనిషిని ఇతరుల మనసులోనుంచి వేరు చేయలేదనే సత్యం చంద్రశేఖర్‌గారి పట్ల అక్షరాలా వర్తిస్తుంది. ఆయన ఇవాళ మన మధ్య లేకున్నా యంగ్ టర్క్‌గా ఆయనతోబాటు పనిచేసిన మోహన్ ధారియా లాంటి మరికొంత మంది పార్లమెంటు సభ్యులు ఒక ప్రత్యేకమైన ముద్ర వేసి దేశ రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి యంగ్ టర్క్స్‌గా బాగా

ప్రాచుర్యం పొందారు. పరిణతి చెందిన పార్లమెంటేరియన్‌గా వివిధ రాజకీయ పక్షాలపై వీరియొక్క ప్రత్యేకమైన ప్రభావం చూపించారు.

విద్యార్థి దశనుంచి శ్రీ చంద్రశేఖర్‌గారు ఫైర్ బ్రాండ్ అని అనిపించుకొన్న సంస్కరణవాది, అభ్యుదయవాది. ఉజ్వలమైన దేశ భవిష్యత్తు పట్ల విశ్వాసం సడలని ఆశావాది. యువతరంయొక్క చైతన్య స్ఫూర్తితో యంగ్ టర్క్స్ అని పిలవబడ్డ గొప్ప పార్లమెంటేరియన్ అయిన శ్రీ చంద్రశేఖర్‌గారి స్ఫూర్తితో ఇందిరాగాంధీగారు అనేక చారిత్రాత్మక సంస్కరణలు తీసుకొచ్చిన విషయం మనకందరకు తెలుసు. పేదరిక నిర్మూలనకు, ప్రజాస్వామ్య సామ్యవాదానికి శ్రీమతి ఇందిరా గాంధీగారు పాటుపడ్డారు. అంతకు ముందున్న వారి మూస పద్ధతి రాజకీయాల నుంచి మార్చి అనేక కార్యక్రమాలను చేపట్టి పేదవాడి ముంగిట దగ్గరకు పరిపాలనను తీసుకొచ్చి ప్రతి పేదవాడు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో సోషలిస్టు సిద్ధాంతాలతో ముందు తీసుకొనిపోయిన శ్రీమతి ఇందిరా గాంధీగారికి అనేక విధాలుగా శ్రీ చంద్రశేఖర్‌గారు అండదండగా నిలిచారు. పేద ప్రజల సంక్షేమం పట్ల పూర్తిగా మొగ్గు చూపడం యంగ్ టర్క్స్ ముఖ్యోద్దేశమని ఆయన ఎప్పుడూ చెప్పేవారు. వారు నిర్మాణాత్మక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టేవారు.

పేదలకు భూముల పంపిణీ విషయంలో ఆచార్య వినోభా బావే చూపిన చొరవ వారిపై గొప్ప ప్రభావం చూపించింది. తన సొంత నియోజకవర్గమైన బలియాలో ఒక ట్రస్టు ఏర్పాటుచేసి నిర్మాణాత్మక కార్యక్రమాలు కొనసాగించారు. 1971వ సంవత్సరంలో శ్రీమతి ఇందిరా గాంధీ గారు సాటిలేని జాతీయ నేతగా ఆవిర్భవించేందుకు శ్రీ చంద్రశేఖర్‌గారి మద్ధతు బాగా ఉండింది. 1971వ సంవత్సరంలో జరిగిన చారిత్రాత్మక ఘట్టం భారతదేశ చరిత్రలోనే ఒక పెద్ద మార్పును తీసుకొచ్చింది.

అలహాబాద్ విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా ఎంఏ రాజనీతి శాస్త్రంలో పట్టాపుచ్చుకున్న శ్రీ చంద్రశేఖర్‌గారు ఆచార్య నరేంద్రదేవ్ గారి సోషలిస్టు భావాలను ఆకర్షితుడై సోషలిస్టు పార్టీ తరపున రాజ్యసభలో అడుగుపెట్టారు. అప్పటినుంచి కూడా సోషలిస్టు భావ ప్రేరణకు ప్రత్యేకంగా కృషిచేసిన వ్యక్తి. అశోక్ మెహతా ప్రణాళికా విధానానికి ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ రాజకీయాలలో ఒక మంచి సోషలిస్టు మార్పును తీసుకొచ్చిన ఘనత ఆయనది. శ్రీ చంద్రశేఖర్‌గారు లేని లోటు సులభంగా భర్తీ చేయలేనిది, ఆ లోటును భర్తీ చేయడం చాలా కష్టం . ప్రజా జీవితంలో ఒక మహనీయ వ్యక్తిని మనం కోల్పోయాం.

శ్రీ చంద్రశేఖర్‌గారు సాధారణ రైతుగా తన జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి రాజకీయాలలో ప్రత్యేకమైన నిబద్ధతతో ఎప్పుడూ కూడా ముందుకు తీసుకొనిపోయే పరిస్థితుల్లో శ్రీ చంద్రశేఖర్‌గారు తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని భారత రాజకీయ చరిత్రలో ఏర్పాటుచేసుకున్నారు.
ఉ.10.10

ఇవాళ చంద్రశేఖర్‌గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్ధిస్తూ వారి కుటుంబానికి ఈ సభ తరుపున ప్రగాఢమైన సంతాపాన్ని తెలుపుతూ ఆయనకు శాశ్వతంగా గుర్తు ఉండేటట్లు నివాళి అర్పించాలని సభను కోరుతున్నాను.

శ్రీ దాడి వీరభద్రరావు: అధ్యక్షా, సభకు నమస్కారం, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని తెలుగుదేశం లెజిస్లేచర్ పార్టీ సమర్ధిస్తోంది. 24 సంవత్సరాల వయస్సులో ప్రజా సోషలిస్టు పార్టీ కార్యదర్శిగా రాజకీయ బాధ్యతల్ని అరంగేట్రం చేసి 57 సంవత్సరాలపాటు నిరంతరం ప్రజాసేవ చేసిన రాజకీయ శ్రామికుడు చంద్రశేఖర్‌గారు. ఉత్తరప్రదేశ్‌లో ఇబ్రహింపట్టి అనే గ్రామంలో ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగినటువంటి వ్యక్తి. వారి అసలు పేరు ఠాకూర్ చంద్రశేఖర్ సింగ్ సోషలిస్టుగా ఒక కులాన్ని ప్రతిబింబించే పేరు తనపేరులో ఇమిడి ఉండకూడదని అభిప్రాయంతో ముందున్న ఠాకూర్‌ని వెనుకనున్న సింగ్‌ని తొలగించి చంద్రశేఖర్‌గా మిగిలిపోయారు. సమసమాజ నిర్మాణం కోసం భారతదేశ రాజకీయ చరిత్రలో యంగ్ టర్క్ నాయకుడుగా తను నమ్మిన సిద్దాంతాన్ని, నమ్మిన ఆశయాలను సాధించడం కోసం రాజకీయం రంగంలో పోరాటాన్నే ఊపిరిగా తీసుకొని ఎక్కడ యిమడలేకపోయాడు. నాయకత్వం పట్ల విధేయత వున్నప్పటికి విధానలపట్ల రాజీపడలేదు. నాయకత్వాన్ని నిర్మొహమాటంగా నచ్చచెప్పేవాడు, వినకపోతే తిరుగుబాటు చేసేవాడు, ఇంకా అవసరమైతే కొత్తపార్టీని పెట్టేవాడు, వారిది విభిన్నమైనటువంటి వ్యక్తిత్వం .13 సంవత్సరాలు ప్రజాసోషలిస్టు పార్టీ, 14 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ, 12 సంవత్సరాలు జనతాపార్టీ, 18 సంవత్సరాలు సమాజవాది జనతాపార్టీలలో అత్యున్నత పదవులు, బాధ్యతలు నిర్వహించారు. ప్రధానులైనటువంటి జవహర్‌లాల్‌నెహ్రూ, ఇందిరాగాంధీ, మొరార్జీదేశాయి, వి.పి.సింగ్, పెద్దలు జయప్రకాష్ నారాయణ్ మొదలైనటువంటి పెద్ద వాళ్లందరిని కూడా సయోద్య జరుపుతూ విధాన నిర్ణయాల్లో ప్రధానమైన పాత్ర తీసుకొనేవారు. పెట్టుబడిదారి వ్యవస్థకు వ్యతిరేకంగా అట్టడుగున వున్నటువంటి సామాన్య ప్రజానీకానికి, పేదప్రజానీకానికి, బడుగువర్గాలకు మేలు చేసే విధానల కోసం పోరాటం చేసేవారు. సిమ్లాలో ఏఐసిసి వర్కింగ్ కమిటి ఎన్నికలు జరిగినప్పుడు పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా పోటీచేసి గెలుపొందారు. సహచర పార్లమెంటు సభ్యులు విక్టరీ డిన్నర్ ఇవ్వాలని చంద్రశేఖర్‌గారిని కోరినప్పుడు "No, no. She is my party leader. Don't be childish. We cannot tease our leader" అని చెప్పినటువంటి వ్యక్తిత్వం కల్గినటువంటి మనిషి. 57 సంవత్సరముల రాజకీయ జీవితంలో ఒక పర్యాయం రాజ్యసభకు, 8 పర్యాయాలు లోకసభకు ఎన్నికై ఈనాడు కూడా లోకసభ సభ్యునిగా వారు స్వర్గస్థులైనారు. ఇందిరాగాంధి హత్యానంతరం జరిగిన ఎన్నికలో ఒకేఒక పర్యాయం మాత్రం వారు ఓటమి చెందారు. ఆ విధంగా ప్రజలతో మమేకం అవుతూ ప్రజాసమస్యలతో కలసి జీవిస్తూ ప్రజాసమస్యల కోసం పోరాడేటటువంటి వ్యక్తిగా నియోజకవర్గంలో మంచి పేరు సంపాధించిన నాయకుడు. 1975లో కాంగ్రెస్‌పార్టీ వర్కింగ్ కమిటిలో వుంటూ ఢిల్లీ వచ్చినటువంటి జయప్రకాష్‌నారాయణ్ మీద గౌరవం కొద్ది ఆయకు బ్రేక్‌ఫాస్టు ఎవరు ఇస్తారు అని అందరు ఆలోచించేటటువంటి సమయంలో ధైర్యంగా 20 మంది ఎంపిలను తన నివాసానికి పిల్చి జయప్రకాష్ నారాయణ్‌ను వారు ఆహ్వానించి ధైర్యంగా స్వాగతం చెప్పినటువంటి వ్యక్తిత్వం కల్గిన వారు. ఎమర్జన్సీకి వ్యతిరేకంగా తమ నాయకురాలైన ఇందిరాగాంధీతో పోరాడారు. జయప్రకాష్ నారయణ్‌ను తెల్లవారు జామున ఎమర్జన్సీ సమయంలో అరెస్టు చేస్తే అరెస్టును ప్రతిఘటిస్తూ పోలీస్ స్టేషనకు వెళ్లినటువంటి సందర్భం కూడా వున్నది. ఆ విధంగా ఎమర్జన్సీని వ్యతిరేకించినందుకు మీసా క్రింద అరెస్టు చేసి 19 నెలలు జైల్ పాలు అయ్యారు. 1983లో కన్యాకుమారి నుండి ఢిల్లీవరకు ప్రజాసమస్యలు తెలుసుకోవడం కోసం ప్రజల తాలుకా ఆర్థిక, సాంఘిక స్థితిగతులు, 4,260 కిలోమీటర్లు పాదయాత్ర చేసినటువంటి వ్యక్తి. 1990లో మైనారిటి ప్రభుత్వానికి భారత ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసి తక్కువ కాలం వారు పనిచేయడం జరిగింది. కేంద్ర క్యాబినెట్‌లో పరిపాలన పరమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టి చాలా ప్రయత్నం చేశారు. ఆనాడు ప్రజాస్వామ్యానికి కాకుండా ఈ భ్యూరోక్రటిక్ వ్యవస్థకే ప్రాధాన్యత ఉన్నటువంటి రోజుల్లో ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని అభిప్రాయంతో ఆ కార్యక్రమం చేపట్టడం జరిగింది. కాని ఆయనకు

సమయం చాలకపోవడంవల్ల అందులో సఫలం కాలేకపోయారు. ప్రధానమంత్రిగా వారు చేసినటువంటి కొన్ని పనులు ప్రజలకు సన్నిహితంగా లేకపోయినటువంటి సంఘటనలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారాన్ని తాకట్టు పెట్టడం, విదేశీ ఆర్థిక సంస్థల నుండి రుణాలు తీసుకోవడం, కరుణానిధి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయడం, రాజీవ్‌గాంధిపై హర్యానా పోలీసులను స్పైగా నియమించారన్న ఆరోపణలు రావడంవల్ల వివిధ విషమ పరిస్థితులను ఎదుర్కోవడం జరిగింది. తరువాత కాంగ్రెస్ పార్టీ వారు మద్దతు ఉపసహరించుకోవడం ప్రధాని పదవిపోవడం జరిగింది. లోకసభ నుంచి రాష్ట్రపతి భవన్‌కు నేరుగా నడ్చుకుంటూ వెళ్లి ప్రధాని పదవికి రాజినామా ఇవ్వడం జరిగింది. ఈ దేశంలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా మొట్టమొదటి కాంగ్రేసేతర జనతా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. జనతాపార్టీ అధ్యక్షునిగా జయప్రకాశ్ నారాయణకు అండగా నిలబడి చేసిన కృషి ఈ దేశ చరిత్రలో మర్చిపోనటువంటి విషయం . అదే విధంగా మన రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, కాంగ్రేసేతర పక్షాలు నిర్వహించిన సభలలో, సమ్మేళనాలలో చంద్రశేఖర్‌గారు పాల్గొన్నారు. 1977లో ఉప్పెన వచ్చినప్పుడు ఉప్పెనలో దెబ్బతిన్నటువంటి ప్రాంతాలలో పర్యటించి బాధితులను పరామర్శించినటువంటి వ్యక్తి. ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌కు ఆయనకు సన్నిహితమైన సంబంధం వున్నది. చంద్రశేఖర్‌గారి రాజకీయ జీవితాన్ని అందులో ఉన్నటువంటి మంచిని, ఉద్రిక్తతను,వారిలో ఉన్న నిజాయితిని ఈ నాటి యువకులు అందరు కూడా ఆద ర్శంగా తీసుకోవలసిన అవసరం వున్నది. రాష్ట్ర ప్రజల తరుపున, తెలుగుదేశం పార్టీ తరుపున చంద్రశేఖర్‌గారికి నివాళి అర్పిస్తున్నాను.

శ్రీ కె.రోశయ్య: అధ్యక్షా, ముఖ్య మంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తూ కొన్ని విషయాలు చెప్పదల్చుకున్నాను. మనదేశం ఒక గొప్ప దేశభక్తుడిని కోల్పోయింది. ఈ దేశంలో ఆ వెల్తిని భర్తీ చేయడం అంత తేలిక కాదని ముఖ్యమంత్రిగారు చెప్పిన మాటతో నేను కూడా ఏకీభవిస్తూన్నాను. అనుభమైనటువంటి వ్యక్తిత్వం కల్గినటువంటి వారు. చాలా మందిని చూస్తూవుంటాము. ఈ దేశంలో చాలా కాలం రాష్ట్రాలలో దేశ స్థాయిలో వివిధ పార్టీల తోడ్పాటుతో పదవులు నిర్వహించి తద్వారా ప్రజలలో కొంచెము ప్రాచుర్యం పొంది ఒక నాయకుడుగా కొంతమందిని చూస్తూవుంటాము.
ఉ.10.20

కాని అలా కాకుండా ఏనాడూ కూడా అధికారానికి ఆశ పడకుండా, అధికారం వచ్చే అవకాశం అల్లంత దూరంలో కనిపిస్తున్నా, అధికారం కంటే దేశం మిన్న, దేశ ప్రజలు మిన్న అనే భావనతో బయటే ఉండిపోయి, దేశ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసిన వారాయన.

చంద్రశేఖర్ గారు నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకులు. అందుకనే పార్టీలకు అతీతంగా అందరూ వారిని గౌరవిస్తున్నారు. పార్లమెంటులో 8 సార్లు లోక్‌సభ సభ్యుడుగా ఎన్నికయ్యారు. కొద్ది కాలం నేను కూడా లోక్‌సభ సభ్యుడిగా ఉన్న కాలంలో చంద్రశేఖర్ గారి లాంటి ఉద్దండులైన వ్యక్తులు ఏదైనా ఒక విషయం మీద ప్రసంగం చేస్తున్నారంటే సెంట్రల్ హాలులో కూర్చున్న వాళ్లందరూ బిలబిల మంటూ లేచి ఉపన్యాసం వినడానికి లోపలకు వచ్చేవారు. అంతటి ఉత్సుకతను ప్రజలలో, పార్లమెంటు సభ్యులలో కల్పించిన వారు చంద్రశేఖర్ గారు. సోషలిస్టుగా సోషలిజాన్ని వరించిన వారు. సోషలిస్టు సమాజం కావాలని కోరుకున్న వారు, కృషి చేసిన వారు చాలామంది ఉన్నారు. కాని అటువంటి వారిలో కొద్ది మందిని మాత్రమే మనం గుర్తు పెట్టుకుంటాము. అలాంటి వారిలో చంద్రశేఖర్ గారు ఒకరు. వారికి నివాళులు అర్పిస్తూ, వారి సతీమణి, వారి

కుమారులు మిగిలిన కుటుంబ సభ్యులకు అందరికీ కూడా వారి మరణం వల్ల కలిగే దు:ఖాన్ని దిగమింగే శక్తిని భగవంతుడు కల్పించాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పువ్వాడ నాగేశ్వర రావు : అధ్యక్షా, చంద్రశేఖర్ గారి మరణం వల్ల ఏర్పడిన లోటు పట్ల ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను. చంద్రశేఖర్ గారు తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో చాలా ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. కాంగ్రెసులో ఉంటూనే అరెస్టు అయిన నాయకుడాయన. కాంగ్రెసులో ఉంటూ, కాంగ్రెసునే కొన్ని సందర్భాలలో సేధించినవాడు. కాంగ్రెసులో అతివాద భావాలను వ్యాప్తి చేయడానికి 'యంగ్‌టర్క్' గ్రూపును ఏర్పాటు చేసి, దేశ రాజకీయాలను ప్రభావితం చేయడానికి తన వంతు ప్రయత్నం చేశారు. అన్ని రాష్ట్రాలను కలియతిరుగుతూ నాలుగు నెలల పాటు సుదీర్ఘ పాదయాత్ర చేసిన ఆయన జీవితం నుంచి మనమందరం ఎంతో నేర్చుకోవాలి. కాంగ్రెసు పార్టీ కీ.శే. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నపుడు 1969లో ఒకసారి చీలిపోయింది. 1969 నుంచి 1971 వరకూ మా సిపిఐ, సిపిఎం పార్టీలు కాంగ్రెసు పార్టీకి తోడ్పాటు నిచ్చి, పార్లమెంటులో మెజారిటీ కోసం, ఆనాడున్న పరిస్థితులలో మా కోరికలను కూడా ప్రతిబింబిస్తూ ఇందిరాగాంధీ గారు ... ఆనాడు, నిజానికి కాంగ్రెసులో సోషలిజం పెట్టాలని అంతకు ముందే ఉన్నప్పటికీ, ఈ ప్రత్యేక పరిస్థితులలో రాజభరణాలను రద్దు చేయడం, బ్యాంకులను జాతీయం చేయడం వంటివి ఆమెకు సాధ్యపడింది. కాంగ్రెసులో ఉన్న వైరుధ్యం సరైన మార్గాన్ని దేశంలో నడిపించడానికి ఈ అకేషన్ ఉపయోగపడింది. ఆ సందర్భంలో చంద్రశేఖర్ గారు గట్టిగా నిలబడ్డారు.

తర్వాత దేశానికి, కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా మొదటిసారి ఏర్పడిన మరొక ప్రభుత్వం జనతా పార్టీది. ఆ పార్టీకి దేశాధ్యక్షులుగా వారున్నారు. ఒకటి రెండు సందర్భాలలో ఆయనతో కలిసి అప్పటి సభలలో పాల్గొనే అవకాశం నాకు దొరికింది. 1984 ప్రజాస్వామ్య ఉద్యమంలో ఆయన మన వద్దకు వచ్చారు. అప్పుడొక బహిరంగ సభ పెట్టాము. అప్పటి మా పార్టీ జనరల్ సెక్రటరీ రాజేశ్వర రావు గారితో కలిసి, బెంగళూరులో ఒక బహిరంగ సభ పెట్టినపుడు వారితో కలిసి పాల్గొనే అవకాశం కలిగింది. ప్రజాస్వామ్యం కోసం వారి తపన, అవసరమైతే తిరుగుబాటు చేసి అయినా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలనే అభిప్రాయం కలిగిన వాడు. తన అభిప్రాయాలను మార్చుకోకుండా, పేద ప్రజల పక్షపాతిగా సామ్యవాద భావాలను కలిగిన వ్యక్తిగా దేశంలో ఎప్పుడూ ముందుండేవారు. దేశ రాజకీయ చిత్రపటాన్ని చూస్తే అనేకమంది అనేక రకాల త్యాగాలు చేశారు. దేశ రాజకీయ చిత్రపటాన్ని చూస్తున్నాము. సంకీర్ణ ప్రభుత్వాల యుగం బహుశా 1971 తర్వాతే ఏర్పడుతూ వచ్చింది. జనతాపార్టీ, కాంగ్రెసు పార్టీలున్నాయి. తర్వాత అనేక పార్టీలలో ఉన్నవాళ్లు జనతాపార్టీగా ఏర్పడ్డారు. ఈ రాజకీయాలను మరింతగా ప్రభావితం చేయడానికి నిలకడగా నడపటానికి ఈ రాజకీయాలలో వచ్చిన ఒడిదుడుకులను తట్టుకుని ముందుకు తీసుకువెళ్లడానికి తమ అభిప్రాయాలను ప్రతిబింబించే విధంగా అవసరమైన వాళ్లతో చంద్రశేఖర్ గారు మంచి పాత్ర వహించాడు. దేశంలో మంచి బాటను చూపించిన వాడు. కష్టకాలంలో ఎట్లా మెలగాలో చూపించాడు. ఆయన జీవితంలో చాలా కష్టపడ్డాడు. పార్టీలు మారినపుడే కాదు, వేరే విధంగా 8 సార్లు గెలిచినా చాలాసార్లు ఒడిదుడుకులను చూశారు. పెద్ద పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ, వారి వెనక ఒకదశలో భార్యా పిల్లలు తప్ప ఎవరూ లేని పరిస్థితిలో స్వంత పార్టీగా నడిపించుకుంటూ వచ్చాడు.

ఏది ఏమైనా ఆయన లేని లోటు దేశానికి తీరని లోటు. ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ మా పార్టీ తరపున వారి మరణానికి సంతాపం తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కె. దిలీప్ కుమార్ : అధ్యక్షా, భారత మాజీ ప్రధాని చంద్రశేఖర్ గారి మృతి పట్ల సంతాపాన్ని ప్రకటిస్తూ గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని తెలంగాణా రాష్ట్ర సమితి తరపున బలపరుస్తున్నాను. మాజీ ప్రధాని చంద్రశేఖర్ గారు గొప్ప లౌకిక వాది, సోషలిస్టు. సమస్యలను చక్కగా ఆకళింపు చేసుకోవడమే కాకుండా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడిన గొప్ప మనిషి. నీతి నిజాయితీలకు నిలువుటద్దం వంటి వాడు. ప్రజా సమస్యల పట్ల ఏ విధంగా అయితే మడమ తిప్పకుండా పోరాటం చేశాడో, ఆ పోరాట స్ఫూర్తి మిగిలిన రాజకీయ నాయకులనే కాకుండా, సమకాలీన రాజకీయవేత్తలను కూడా తీవ్రంగా ప్రభావితం చేయడం మనకు తెలుసు. అటువంటి గొప్ప రాజకీయవేత్త మరణంతో దేశంలో ఏర్పడిన లోటు వంటిది అరుదుగా పూరింపబడుతుంది.

చంద్రశేఖర్ గారిని కలుసుకునే అవకాశం నాకు కూడా లభించింది. తెలంగాణా సమస్యల పట్ల, తెలంగాణా వెనుకబాటుతనం పట్ల వారికి చక్కని అవగాహన ఉండేది. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రజల మనోభావాలను వ్యక్తం చేస్తూ, ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతను గురించి సోనియా గాంధీ గారికి లేఖ రాశారు.
ఉ.10.30

వారి మరణంతో ఒక రకంగా తెలంగాణా ప్రజలకు కూడా తీరని నష్టం జరిగింది. అటువంటి గొప్ప లౌకికవాది, ప్రజాస్వామ్యవాది, నిగర్వి, నిరాడంబరుడు, అజాత శతృవు అయిన నాయకుడి మరణం పట్ల తెలంగాణా రాష్ట్రసమితి పార్టీ తరపున, ప్రజల తరపున తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సిహెచ్.సీతారాములు : సభకు నమస్కారం. ఈ రోజు గౌరవ ముఖ్యమంత్రి గారు భారత మాజీ ప్రధాని చంద్రశేఖర్‌గారి మృతికి సంతాపం తెలియజేస్తూ ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని మా పార్టీ తరపున బలపరుస్తున్నాను.

పెద్దలు చంద్రశేఖర్ గారు భారతదేశపు 11వ ప్రధాన మంత్రిగా తక్కువ కాలం పని చేసినా, దేశం మీద పెద్ద ప్రభావాన్ని చూపిన గొప్ప నాయకుడు ఆయన. సుమారు 80 సంవత్సరాల వయస్సులో అనారోగ్య కారణాల చేత వారు చనిపోయారు. ఒక పేద, మధ్య తరగతి కుటుంబంలో పుట్టి సుమారు 40 సంవత్సరాల పాటు ఎనిమిది పర్యాయాలు పార్లమెంట్ సభ్యునిగా అనుభవం వున్నప్పటికీ ఆయన ఏ మంత్రి పదవినీ చేపట్టకుండా రాజకీయాలలో వున్న వ్యక్తి, బహుశ చరిత్రలో అరుదైన వ్యక్తి ఆయన. పదవులకోసం ఆరాటపడే ఈ రోజులలో అంత సుదీర్ఘ కాలం పాటు పార్లమెంటేరియన్‌గా వున్నా, వారి సొంత పార్టీ అయిన జనతా పార్టీ అధికారంలో వున్నప్పటికీ, ఆయన మంత్రి పదవిని ఆశించకుండా ప్రజల కోసం, ప్రజా ఉద్యమాల కోసం పని చేసిన నాయకుడు ఆయన. దీనిని చాలా అరుదైన విషయంగా మనం గమనించాలి.

అదే విధంగా 1971లో యంగ్‌టర్క్ గ్రూప్‌కు నాయకత్వం వహించడం, భూ సంస్కరణలు, రాజభరణాల రద్దు వంటి అనేక సమస్యలను ముందుకు తీసుకొచ్చి దేశ ప్రజల మీద ఒక ముద్రను వేసిన రాజకీయ వేత్త చంద్రశేఖర్ గారు. అదే సందర్భంలో పెద్ద పారిశ్రామిక వేత్తలకు, భూస్వాములకు రాయితీలను కల్పించడాన్ని కూడా ఆయన వ్యతిరేకించారు. నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం, పేద ప్రజలకు అనేక

రాయితీలు కల్పించాలని కోరుకున్న నాయకుడు.  అదే విధంగా ఎక్కడ మత ఘర్షణలు జరిగినా, మతానికి సంబంధించిన అంశాలు ఎక్కడ తలెత్తినా ఒక లౌకికవాదిగా ముందుండి ఖండించేవారు.  ప్రజాస్వామ్యం కోసం పనిచేసిన నాయకుడు, మత సామరస్యం కోసం పనిచేసిన చరిత్ర గలిగిన నాయకుడు.

మన దేశ రాజకీయాలలో ఎమర్జన్సీ చాలా ముఖ్యమైన ఘటన.  ఎమర్జన్సీ కాలంలో జనతాపార్టీ ఆవిర్భవించగా, దానికి అధ్యక్షుడిగా వుండి, కేంద్రంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక పెద్ద పోరాటం నడిపిన నాయకుడు.  ఆయన అధ్యక్షుడిగా వుండగా జనతాపార్టీ అధికారంలోకి రావడం జరిగింది.  అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా జయప్రకాష్ నారాయణ్ గారి ఉద్యమంలో పాలు పంచుకుని జెయిలుకు వెళ్లిన నాయకుడు ఆయన.  ఎమర్జన్సీ రోజులలో జనతాపార్టీ ఆవిర్భావం అనేది చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమైతే, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా జరిపిన పోరాటంలో చంద్రశేఖర్ గారు కీలకమైన పాత్రను పోషించారు.  మొత్తం మీద దేశ ప్రజల మీద చంద్రశేఖర్ గారు ఒక మంచి ముద్రను వేయడం జరిగింది.  ఆయన ఒక మంచి స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప దేశభక్తుడు.  వారిలో వున్న మంచిని స్వీకరించి, వారి అడుగుజాడలలో నడవడానికి ప్రయత్నించవలసిన అవసరం వుంది.  అదే వారికి మనం అర్పించే నివాళిగా భావించాలి.  చంద్రశేఖర్ గారి మరణం పట్ల తీవ్రమైన సంతాపాన్ని తెలియజేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ ముగిస్తున్నాను.

శ్రీ పాలడుగు వెంకట్రావు :  అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని నేను బలపరుస్తూ, రెండు మాటలు చెబుతాను.  ఆయన చనిపోయే ముందు, 5 నెలల క్రితం ఆయన ఇంటికి వెళ్లి చూసాను.  ఆయన ప్రక్కన వున్న వారు మాత్రం ఎక్కువగా మాట్లాడవద్దని చెప్పారు.  మా పాత స్నేహాన్ని ఆయనకు గుర్తు చేసి నమస్కారం పెట్టి రావడం జరిగింది.  ఆయన ప్రధానమంత్రి కాకుండా వున్నపుడు పాలికా బజార్‌లో, ఆ క్రింది భాగం కట్టనపుడు ఆయన ఒక చిన్న గదిలో కూర్చునేవారు.  ఆ కుర్చీని చూస్తే, దానికి వున్న మేకులు ఆయన పంచకు పట్టుకుని రెండు మూడు చోట్ల చిరిగి వుండేది.  దాని ద్వారా ఆయన యొక్క సింప్లిసిటీని మనం అర్థం చేసుకోవచ్చు.

1968 నుంచీ నేను ఢిల్లీ వెళ్లినపుడల్లా, ఆయన ఏ పార్టీలో వున్నా వెళ్లి కలుస్తూ వుండేవాడిని.  ముఖ్యంగా ఆయన నెహ్రూవాది.  జయప్రకాష్ నారాయణ్‌కు ఏ విధంగా శిష్యులో, నెహ్రూ భావాలకు కూడా అదే విధంగా అనుచరులు.  లెజిస్లేచర్‌కు, జుడిషియరీకి తగాదా వచ్చినపుడు ఆయన సెంట్రల్ హాల్‌లో కూర్చుని వున్నారు.  నేను వారిని అడిగాను, '' మీరు ఇక్కడ కూర్చున్నారు, లోపల గొడవ జరుగుతోంది, ఈ దేశాన్ని గురించి, మన లెజిస్లేచర్ గురించి మీరు చెప్పకపోతే భవిష్యత్తులో ఎవరు చెబుతారు, మీరు నెహ్రూతో వున్నవారు, '' అంటే ఆయన ఇప్పుడే ఖచ్చితంగా చెబుతానని అన్నారు.  అని వెంటనే లోపలకు వెళ్లారు.  మళ్లీ అక్కడ గొడవ జరగడంతో హౌజ్ ఎడ్జర్న్ అయిపోయింది.

ఆయన మళ్లీ వెంటనే సెంట్రల్ హాల్‌లోకి వచ్చారు.  '' నేనేమి చెయ్యాలి, చెప్పడానికి కూడా సమయం ఇవ్వని పార్లమెంట్ వచ్చింది, ఈ దేశాన్ని భగవంతుడే కాపాడాలని '' అన్నారు.  నేను విద్యార్థిగా వున్నపుడు ఆయన ఏమి చెబుతారో వినడానికి మూడు మైళ్లు దూరం వెళ్లే వారం.  ఎప్పుడైనా ఆయన మాటలు వస్తే, వాటిని వేదవాక్కులాగ తీసుకునేవాళ్లం.  ఈ దేశ భవిష్యత్తు కోసం ఆయన కన్న కలలు, నెహ్రూ ఏ కలలనైతే కన్నారో, ఆ కలలను ఇందిరాగాంధీ గారి ద్వారా సాకారం చేయాలని అనుకున్నారు.  ఇందిరాగాంధీ గారితో

తగాదా విషయం – ఇవన్నీ చాలా చిన్న విషయాలు. ఈ దేశంలో చాలా మంది పెద్ద పెద్ద సోషలిస్టులు చనిపోయారు.

ఈ దేశంలో సోషలిస్టులు తీవ్రంగా వున్న రోజులలో నెహ్రూ గారు సోషలిస్టు సమాజాన్ని తీసుకురావడం జరిగింది. ఇందిరాగాంధీ గారు రాజ్యాంగాన్ని మార్చవలసిన పరిస్థితి వచ్చింది. దాని వెనుక సోషలిస్టులు వున్నారు. కాంగ్రెస్ వారితోపాటు సోషలిస్టులు వున్నారు. ఇవి చిన్న చిన్న విషయాలేమీ కాదు. ఆయన ఒక తుఫానులాగ మాట్లాడేవారు. తుఫాను ఎట్లా వుంటుందో ఆయన స్పీచెస్ అట్లానే వుండేవి. ఒక అగ్ని ఆరిపోయింది. ఈ దేశంలో సోషలిస్టులు తగ్గిపోతున్న కొద్దీ రియాక్షనరీ ఫోర్సెస్ ముందుకు వస్తునాయి. ఈ దేశ ఐక్యతకు ఒక ప్రమాదం వచ్చింది. ఆ రోజున లక్నోలో వున్న సోషలిస్టులైనా, బొంబాయిలో వున్న సోషలిస్టులైనా ఈ దేశ ఐక్యత కోసం బాధపడేవారు, సిద్ధాంతాలను గురించి బాధపడేవారు. ఈ రోజున కాంగ్రెస్ పార్టీ కొంత ఇబ్బందులు పడడానికి కూడా కారణం దాదాపు ఈ సోషలిస్టులు తగ్గిపోతున్నందువల్లనే. మనకు రెండు రకాల సోషలిస్టులు వున్నారు. కాంగ్రెస్ పార్టీని కాదన్నవారు వున్నారు, అవునన్న వారు వున్నారు.
ఉ.10.40

భారత రాజకీయాలలో ఒక 40 సంవత్సరాల పాటు సోషలిస్ట్ యొక్క బలం, వారి ఆవేదన , ఆదర్శాలు అన్నీ కూడా కాంగ్రెస్ పార్టీకి బలంగానే ఉన్నాయి. అటువంటి చంద్రశేఖర్‌గారు ఈ రోజు లేకపోవడం భారతదేశ రాజకీయాలకు తీరని లోపం, ఒక ధృవతార రాలిపోయింది. వారి కుటుంబానికి, మనఃశ్శాంతి కలగాలని కోరుతున్నాను.

శ్రీ డి. రామిరెడ్డిః చంద్రశేఖర్‌గారి మరణానికి గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మా పి.డి.ఎఫ్., తరఫున సంపూర్ణంగా బలపరుస్తున్నాను. చాలా మంది సభ్యులు చంద్రశేఖర్‌గారి జీవిత చరిత్ర గురించి చెప్పారు. వారి నైతిక విలువల గురించి చాలా విషయాలు చెప్పారు. వాటి తో ఎక్కడా విభేదించవలసిన అవసరం లేదు. అదే విషయాలను ఈ సందర్భంగా నేను కూడా ఒకటి, రెండు విషయాలను చెప్పదలచాను. చాలా మంది పాత తరం స్వాతంత్ర్య సమయయోధులు చనిపోయినప్పుడు సభలో సంతాప తీర్మానాలు చేయడం, ఆ తరువాత మర్చిపోవడం మాములుగా జరుగుతున్న విషయాలు. చంద్రశేఖర్‌గారి లాంటి మొదటి తరం స్వాతంత్ర్య సమరయోధుల జీవితాలు ఈ నవతరం పిల్లలకు అందించాలంటే ఖచ్చితంగా పాఠ్య పుస్తకాలలో వారి జీవిత చరిత్ర చేర్చి కొత్త తరం పిల్లలు చదివే ఏర్పాటు చేస్తే, అది వారికి నిజమయిన నివాళి అవుతుంది. లేకుంటే, మొక్కుబడిగా సంతాప తీర్మానం చేయాలి కాబట్టి అది మనం చేసినట్లు అవుతుంది. దానికి భిన్నమైన పద్ధతిలో నిజమైన నివాళి చేసె కార్యక్రమం ముఖ్యమంత్రిగారు చేపట్టాలని కోరుతున్నాను. మరొక ముఖ్యమైన విషయం, మనందరం చెప్పుకొంటున్న విషయం, చంద్రశేఖర్‌గారు ప్రజాస్వామ్యవాది. సోషలిస్ట్ భావాలు కలిగిన వారు. ప్రపంచంలో, సోషలిస్ట్ భావాలు కలిగినవారు పెద్ద ఎత్తున ప్రచారం జరిగే ప్రక్రియలో ఆ భావాలకు లోనై వారు కొన్ని చేశారు. కానీ ఈ రోజు జరుగుతున్న పరిణామాలు చూస్తే, ఆ సోషలిస్ట్ భావాలకు భిన్నమైన రాజకీయ వాతావరణం కనబడుతోంది. మరీ ముఖ్యంగా నైతిక విలువల విషయంలో గతంలో పత్రికలలో వచ్చాయి. పాత తరంవారు ఎలా జీవించారు, కొత్త తరం వారు ఎలా జీవించారనేది వస్తోంది. నైతిక విలువల విషయంలో ఈ తరం కొద్ది మంది మాత్రమే ఆ విలువలు కాపాడుతూ వస్తున్నారు. వారు నైతిక విలువల గురించి చంద్రశేఖర్‌గారి జీవితం నుండి, అప్పటి వారి ప్రభావాల గురించి తెలుసుకోవాలంటే మనలోకూడా కొంత మార్పు వచ్చి ఆ ఆశయాలకు అనుగుణంగా మన జీవిత విషయాలలో,

ఆలోచనా విధానాలు మార్చుకుంటే అది నిజమైన నివాళి అవుతుంది. వారు ఎమర్జెన్సీ కాలంలో జైలుకి వెళ్లడానికి సిద్ధపడి కాంగ్రెస్‌లో ఉంటూనే వెళ్లిన ఘటన జరిగింది. అది చిన్న ఘటన కాదు. నిర్భయంగా పార్టీలో ఏదైనా భిన్నాభిప్రాయాలు వచ్చినప్పుడు, ఇప్పటి పరిస్థితుల్లో జనరల్‌గా మాట్లాడితే ఎక్కడ పదవిలోంచి తీసివేస్తారోఅని చాలా మంది తమ సొంత అభిప్రాయాలు చెప్పడానికి భయపడుతున్నారు. అలాకాకుండా, జైలుకి వెళ్లడానికి సిద్ధపడి ఆ రోజుల్లోనే చంద్రశేఖర్‌గారు చేసిన కృషి గణనీయమయినది. ఆఖరుగా ఒక్క మాట చెప్పదలచాను. ఆ రోజుల్లో ఐక్య సంఘటనలు సక్రమంగా కాలేదు. కాబట్టి మైనారిటీ ప్రభుత్వాలు ఇష్టం లేనప్పుడు గంటలో కూల్చివే యబడ్డాయి. మురార్జీ దేశాయి, చరణ్‌సింగ్, చంద్రశేఖర్‌గారి ప్రభుత్వాలు కావచ్చు. ఇప్పుడు నాలుగైదు సంవత్సరాల క్రిందట అనుభవంలో మైనారిటీ ప్రభుత్వాలు సుస్థిరంగా మొత్తం పిరియడ్ కొనసాగుతున్నాయంటే, ఆలోచనా ధోరణిలో కొంత మార్పు వచ్చింది. ఇది ఒక్కసారి ఆలోచించాలి. ఒకసారి కమిట్‌అయి ఈ ప్రభుత్వాన్ని పూర్తి కాలాన్ని ఉంచుతామని చెప్పినప్పుడు ఉండడం, నైతిక బాధ్యత. ఈ రోజు కేంద్రంలో మైనారిటీ ప్రభుత్వం కొనసాగుతోందంటే, ఆ నిబద్ధతను కలిగిన రాజకీయ వ్యవస్థ ఉండబట్టే జరుగుతోంది. ఈ వ్యవస్థ ఆ రోజుల్లో ఉంటే, చంద్రశేఖర్‌గారు మరికొంత కాలం ప్రధానమంత్రిగా ఉండి దేశానికి సేవ చేసే వారు. అటువంటి అవకాశం మనం కోల్పోయాము. వారి కుటుంబ సభ్యులకు మరొక్కసారి నివాళులు అర్పిస్తూ, వారికి శాశ్వతమైన స్మారకం ఏర్పాటు చేసే విషయం ఆలోచించాలని కోరుతున్నాను.

శ్రీ కె. యాదవ్ రెడ్డిః గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని పూర్తిగా సమర్థిస్తూ బలపరుస్తున్నాను. వ్యక్తిగతంగా, చంద్రశేఖర్‌గారితో అతి పిన్న వయస్సులో నాకు పని చేసే అవకాశం దక్కింది. ఆయనతో దాదాపు 10,12 సంవత్సరాలు నేను సన్నిహితంగా పని చేసాను. ఆ సందర్భంగా నాకున్న కొన్ని అనుభవాలను ఈ సభ ముందు ఉంచదలచాను. చంద్రశేఖర్‌గారు గొప్ప అభ్యుదయవాది. అదే కాకుండా, గొప్ప ప్రజాస్వామ్యవాది. ధైర్యానికి మారుపేరు. వాటన్నింటి గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. ముఖ్యమంత్రిగారు మిగతా వక్తలందరూ ఈ విషయాల గురించి ఈ తీర్మానంలోనే చెప్పారు. కానీ నేను నా వ్యక్తిగత అనుభవరీత్యా రెండు, మూడు విషయాలు ఈ సభ ముందు ఉంచదలచాను. చంద్రశేఖర్‌గారు పేదల కొరకు నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి. అది అందరికి తెలిసిన విషయం. అంతకన్నా ఎక్కువ ఆయన జీవితంలో ఎన్నో మైలురాళ్లు ఉదాహరణలుగా ఉన్నాయి. చెప్పాలంటే ఎన్నెన్నో ఉన్నాయి. కానీ మూడు, నాలుగు విషయాల గురించి ఇక్కడ నేను చెప్పదలచాను. మొట్టమొదటి మైలురాయి ఆయన జీవితంలోనిది ఏమంటే, పార్టీలో ఉంటూ, ఇంటర్నల్ డెమాక్రసీ కొరకు పోరాడిన ప్రథమ వ్యక్తిఅని నేను అనుకుంటున్నాను. పార్టీలో అధిష్టాన వర్గం వద్దని చెప్పిన తరువాత కూడా పోటీ చేసి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి ఎన్నికయిన విషయం మనందరికి తెలుసు. దాని తరువాత రెండవ మైలురాయి, ఎమర్జెన్సీ మంచిది కాదని దానిని ఎదిరించాలని జైలుకి వెళ్లిన సందర్భాలు ఉన్నాయి. వాటన్నింటికన్నా ముఖ్యమైనది, 1984లో సిక్కుల మీద జరిగిన దాడులు. వారు వ్యక్తిగతంగా ఇంటి నుండి బయలుదేరడం, కొంత మంది యువకులు ఆయనతో దాదాపు 300, 400 మంది వరకూ అక్కడ ఉన్నాము. జరిగిన సంఘటనలో ఆయన మీద కానీ, ఆయన వెంట ఉన్న వారి మీద ఆ దాడుల్లో పాల్గొన్న వ్యక్తులు హత్య చేసేవారు, అలా జరిగినా కూడా ఆశ్చర్యం లేదు. అలాంటి పరిస్థితిని ఎంతో ధైర్యంతో ఎదుర్కొంటూ, సామాన్య ప్రజల మీద జరిగే నరహత్యలను ఆపాలని సిక్కులను కాపాడడానికి ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించిన విషయం నేను వ్యక్తిగతంగా చూశాను, అనుభవించాను. తరువాత ఆయన పాదయాత్రవిషయాలను, నేను ఇక్కడ ఆదివారం పత్రిక సంపాదకుడిగా చేస్తూ, ఫోటోలు తీయడానికి కొంత కాలం ఆయన పాదయాత్రలో పాల్గొని నాలుగైదు ఇష్యూస్ వ్రాసాను. చంద్రశేఖర్‌గారు 'యంగ్

ఇండియా'అనే పత్రిక నడపడానికి ముందుకు వచ్చి దానిలో ఇంటర్నల్ డెమాక్రసీ గురించి ధైర్యంగా మాట్లాడి, ధైర్యాన్ని కోల్పోకుండా మాట్లాడాలని, యువతకు ఎంతో బోధించారు. ఈ సందర్భంగా ఒకసారి, ఆ పత్రికలో నేను అక్కడ ' లవ్ మీ, లవ్ మై డాగ్ ' అనే టైటిల్‌తో ఎడిటోరియల్ వ్రాసినప్పుడు, నన్ను వారు పిలిచారు. పార్టీ నుండి సస్పెండ్ చేయాలని చాలా మంది సలహా ఇచ్చినా, ఆ ఆర్టికల్‌ని వ్రాయడానికి ఎంతో ధైర్యంతో సహకరించావని వారు నన్ను అన్నారు. నాకు నా పాత రోజులు గుర్తుకు వస్తున్నాయి, ఎవరు ఏమి చెప్పినా, నిన్ను సస్పెండ్ చేయనుఅని వారన్నారు. నా వ్యక్తిగత విషయాలను తమ ముందు ఉంచాను. వారు లేని లోటు మనకు తీరదు. వారి మరణంపట్ల నివాళులు అర్పిస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

**ఉ.10.50**

SRI SYED ALTAF HYDER RAZVI: Sir, my party fully supports the Condolence Motion moved by the Hon'ble Chief Minister with regard to the passing away of the former Prime Minister, Sri Chandrasekhar.

Sir, the passing away of Sri Chandrasekhar is a great loss to the nation. Sir, Sri Chandrasekharji was born on July $01^{st}$, 1927 in Ibrahimpatti village in Eastern Utter Pradesh. He was brought into politics in his student life itself and he was a well know socialist. After his education from Allahabad University, he joined the socialist movement in early 1950s in association wtih Sri Acharya Ranga. Sri Chandrasekharji continued in Praja Socialist Party for long and was elected to Rajya Sabha in the year 1962. He joined the Congress Party and three years later he was elected as Chief Secretary of that party.

Sir, with his death an era has ended in Indian politics. He never compromised with what he believed in and he always spoke what he did and what he stood for. Sir, unlike other socialists like Sri George Fernandas, who later joined BJP, Sri Chandrsekhar never gave up socialist principles. He was there as country's Prime Minister for 7 months and later resigned to that post on March 06, 1991.

Sir, today we have assembled here to pay condolence to a great leader. I would also like to request the House at the same time to pay condolence to the people who lost their lives in Makka Masjid Bomb Blast and also due to aftermath police firing. Sir, the incident was one of its kind in the history of Hyderabad. Sir, something like that never happened before. In the old city of Hyderabad many innocent people have lost their lives and their families are in great grief and distress. So, Sir, we must also condone the death of innocent people. Therefore Sir, through you, I would like to request this august House to move a Condolence Motion with regard to those innocent people who lost their lives during the said incident and also in police firing. That can be taken up at the end of these proceedings. I would also request all the political parties to support this move cutting across party lines.

Thank you Sir for giving me this opportunity.

శ్రీ బి.వి. మోహనరెడ్డి :- అధ్యక్షా, మాజీ ప్రధాన మంత్రి శ్రీ చంద్రశేఖర్ గారి మృతి పట్ల, గౌరవనీయులైన ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించిన తీర్మానాన్ని మా ప్రోగ్రెసీవ్ డెమాక్రెటిక్ ఫ్రంట్ తరఫున నేను బలపరుస్తున్నాను. చంద్రశేఖర్ గారు గొప్ప నాయకుడు. ఆయన విద్యార్థినాయకుడుగా ఉండి, జాతీయ నాయకుడి స్థాయికి తన ప్రవర్తన ద్వారా ఎదిగిన వ్యక్తి ౧ ఆయన. ప్రధాన మంత్రి కావడానికి కావలసినంతమంది సభ్యులు లేకపోయినా, అటువంటి వాతావరణం లేకపోయినా, కాంగ్రేస్ పార్టీ మెజారిటీ తో బలపరచడం వల్ల ప్రధానమంత్రి అయ్యారు. ఎంత అద్భుతమైన ప్రధానమంత్రి పదవిని స్వీకరించాడో అంతే సులభంగా దానిని వదిలివేశాడు. ఎటువంటి బాధా లేకుండా, నడుచుకొంటూ వెళ్లి రాష్ట్రపతి గారికి తన రాజీనామాను సమర్పించడమనేది ఆయన చర్యలలో ఒక గొప్ప చర్యగా నేను భావిస్తున్నాను. నమ్ముకున్న దాన్ని సూటిగా చేసే వ్యక్తి ఆయన. ఏదేనీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నా, దానిపై చర్య తీసుకోవాలన్నా, గవర్నర్ గారి ద్వారా రిపోర్టు తెప్పించుకొని, ఆ నివేదికను ఆధారంగా చేసుకొని, అక్కడ ఉన్న ప్రభుత్వం చెడు చేస్తుందని నిర్ధారణ చేసుకొని, ఆ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే అధికారం ప్రధానమంత్రికి, రాష్ట్రపతికి ఉంటుంది. గవర్నర్ నుండి అటువంటి నివేదికను తెప్పించుకోకుండానే తమిళనాడు ప్రభుత్వాన్ని రద్దు చేసి ప్రధానమంత్రి యొక్క శక్తిని చూపించినటువంటి మహనీయుడు చంద్రశేఖర్ గారని తెలియజేస్తున్నాను. అది ఎంత వరకు మంచిది, చెడ్డది అనేది కాకుండా ఆయన చేయదలచుకొన్నది తప్పకుండా చేస్తారని చెప్పడానికే ఇది చెపుతున్నాను. ఆ రోజుల్లో ఎమర్జెన్సీని వ్యతిరేకించి జైలుకి వెళ్లారు. ఒక నాయకుడు, నాయకుణ్ణి ఎదిరించి జైలుకు వెళ్లడం త్యాగం క్రిందకే వస్తుంది. ఆయన దేశానికి తక్కువ కాలం ప్రధానమంత్రిగా చేసినప్పటికి, తన యొక్క ప్రత్యేక ముద్రను ఈ దేశ ప్రజలందరికి వేసినటువంటి విషయంలో ఆశ్చర్యం లేదు. ఆయనకు పేద ప్రజలంటే చాలా ప్రేమ, అభిమానం ఉంది. అటువంటి వ్యక్తి నేడు లేడని అనుకొంటుంటేనే చాలా బాధగా ఉంది. భగవంతుడు వారి కుటుంబానికి, వారి పిల్లలకు మనశాంతిని కల్గించాలని, ఆయన ఆత్మకు శాంతి ప్రస్తావించాలని కోరుతున్నాను.

శ్రీ మహమ్మద్ జానీ :-అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశ పెట్టిన ఈ సంతాప ప్రతిపాదనను నేను సంపూర్ణంగా బలపరుస్తున్నాను. చంద్రశేఖర్‌గారి మరణం జాతికి తీరని లోటు. ఏమి చేసినా ఆ లోటుని మనం భర్తీ చేయలేమని చెపుతున్నాను. భూసంస్కరణల విషయంలో, రాజకీయ పేదరిక నిర్మూలనవైపు మొగ్గిందంటే జరిగిన పోరాటంలో, పోరాడిన యోధుల్లో అగ్రగణ్యుడు శ్రీ చంద్రశేఖర్ గారని తెలియజేస్తున్నాను. భూ సంస్కరణలు రావడానికి ఆయన ఎంతో కృషి చేశారు. జాతీయ సంపత్తితో కూడుకున్న 'బ్యాంకుల జాతీయకరణ' నుండి పేద ప్రజలు లబ్ది పొందడానికి శ్రీమతి ఇందిరాగాంధీ గారు తీసుకొన్న నిర్ణయానికి తన సంపూర్ణ మద్దతుని ఆయన ఇందిరాగాంధీ గార్కి ఇచ్చారు. నేను ఈ సంతాప ప్రతిపాదనను నిస్సందేహంగా బలపరుస్తున్నాను. ఆయన ప్రజాస్వామ్యవాది. ప్రజాస్వామ్య మనగడకు అహర్నిశలు కృషి చేశారు. సామ్యవాద సిద్ధాంతాలు భారతదేశంలో ఉంటేనే ఈ జాతికి మేలు జరుగుతుందన్నది ఆయన సిద్ధాంతం. నూటికి 40 శాతంగా ఉన్న పేద ప్రజల దారిద్ర్యం పోవాలంటే, సామ్యవాద సిద్ధాంతం ఒకటే భారత రాజకీయాలకు ఆదర్శం అని చెప్పిన వ్యక్తి ఆయన. జీవితమంతా మత వాదులు, మత మౌఢ్యులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహనీయ వ్యక్తి అని చెప్పడానికి నేమ వెనుకాడటం లేదు. చిట్ట చివర వరకు, అటు గుజరాత్, గోద్రాలాంటి ముష్కర సంఘటలనపై తనయొక్క అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సదా పోరాటం చేసిన వ్యక్తి. నిజమైన నివాళి చంద్రశేఖర్ గార్కి ఇవ్వాలంటే..... మత వాదులు, మత మౌఢ్యులు రాజకీయాల్లోకి వచ్చారు. వారికి వ్యతిరేకంగా సామ్యవాదులు, లౌకికవాదులు కలిసి పనిచేసి, జాతిని లౌకకవాదాన్ని, జాతీయవాదం వైపు నడిపించినప్పుడే నిజమైన నివాళి అవుతుందనే మాట తెలియజేస్తున్నాను. నా ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని చంద్రశేఖర్ గారి కుటుంబానికి తెలియజేస్తున్నాను.

ఉ.11.00

శ్రీ పాల్వాయి గోవర్దన రెడ్డి : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని నేను పూర్తిగా బలపరుస్తున్నాను. తర్వాత చంద్ర శేఖ గారు పెద్ద ప్రజాస్వామ్య వాది, సోషలిస్ట్ భావాలు పూర్తిగా పుణికిపుచ్చుకున్న వ్యక్తి. నాకు వారు 1966 వ సంవత్సరం నుంచి యువజన కాంగ్రెసులో ఉన్నప్పటి నుంచి వారితో నాకు పరిచయం ఏర్పడింది. తర్వాత కాంగ్రెసులోనే సోషలిస్టు భావాలను బాగా వెలికి తీసి మన ప్రభుత్వాన్ని సోషలిస్టు పథం వైపు నడపాలన్న ఉద్దేశ్యంతో ఆ రోజు సోషలిస్టు కాంగ్రెసును పెట్టడం జరిగింది. మన రాష్ట్రంలో శ్రీ దీన దయాళ్, నర్సి రెడ్డి, తర్వాత చాలామంది పెద్దలు దానిలో భాగస్వాములై ప్రతి సంవత్సరం ఒక కాన్ఫెరెన్సును పెట్టేవారు. తర్వాత ఆ రోజు మురార్జీ దేశాయ్ గారిని అడ్డు కోవడం కోసం, కొంతమంది కాంగ్రెస్ పెద్దలు , ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి గారి తర్వాత శ్రీమతి ఇందిరా గాంధీ గారిని ప్రధాన మంత్రి చేయడం జరిగింది. వారు దేశంలో కాంగ్రెసు పార్టీని సక్రమంగా నడపాలన్న ఉద్దేశ్యంతో ఇందిరా గాంధీ గారితో కలసి పని చేసి చాలా చక్కగా వ్యవహారం నడిపారు. తర్వాత సంజీవ రెడ్డి గారు ఓడిపోయిన తర్వాత కాంగ్రెసు పార్టీ చీలిపోవడం జరిగింది. అప్పుడు చంద్ర శేఖర్ గారు , కృష్ణకాంత్ గారు వీళ్లందరూ కూడా ఇందిరాగాంధీ గారి వైపు ఉండి ఈ దేశంలో సంస్కరణలు కూడా ప్రారంభించడం జరిగింది. చంద్ర శేఖర్, కృష్ణకాంత్ గారు ఉండి చేయడం వల్లనే ఈ సంస్కరణలు రావడం అన్నది జరిగింది. తర్వాత చంద్ర శేఖర్ గారు మన పార్టీని సోషలిస్టు పథంలో నడపడానికి వీలైనంత సహకారం అందించారు. తర్వాత ఎమర్జెన్సీ పెట్టినప్పుడు, కాంగ్రెసు పార్టీ నాయకురాలిని ధిక్కరించి కాంగ్రెసు పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయి, జయప్రకాశ్ గారి నేతృత్వంలో ఆరోజు పెద్ద ఎత్తున ప్రజాస్వామ్య ఉద్యమంలో చేరడం, ఉద్యమం చేయాలని నిర్ణయించడం, చేయడం మీకు తెలిసిందే. ఏమైనప్పటికీ చంద్రశేఖర్ గారు ఈ దేశ రాజకియాలలో సుస్థిరంగా నిలచిపోతారు. తర్వాత వారితో నాకు బాగా పరిచయం ఉంది. కాంగ్రెసు పార్టీ నుండి విడిపోయిన తర్వాత వారితో నాకు పరిచయం కొంత తగ్గింది. ఈ మధ్య 3 లేక 4 ఏళ్ల క్రితం నేను , సత్యనారాయణ రెడ్డి గారు, ఎక్స్ గవర్నర్ గారు మేమందరం కూడా సెంట్రల్ హాల్‌లో కూర్చున్నప్పుడు '' గోవర్దన రెడ్డిజీ ఆప్ హమారా ఘర్‌కూ ఆయీయే , సత్యనారాయణ రెడ్డీ సాబ్ ఆప్ భీ తెలంగాణా కే బారేమే బాత్ కరేంగే '' అని అంటే మేమందరం కూడా వారితో పోయాము, అలా వెళ్లి వారితో చర్చించి , ఉన్న విషయాలన్నీ చెప్పిన తర్వాత , ఆయన '' మంచిది నేను ఇంతవరకూ తెలంగాణా కు సపోర్టు చేయాలని అనుకోలేదు. ఇప్పుడు తప్పకుండా సపోర్టు చేస్తానని మాకు చెప్పడం జరిగింది. ఏమైనప్పటికీ వారు బ్రతికినంత కాలం ప్రజాస్వామ్య విలువలను రక్షిస్తూ , సోషలిజాన్ని ఈ దేశంలో బాగా నిలపాలని కోరినటువంటి వ్యక్తి. కానీ దురదృష్టవశాత్తూ మన దేశంలో జవహర్ లాల్ నెహ్రూ గారి ఎకనమిక్ పాలసీలలో ప్రక్కకు పోయినప్పుడే ఈ దేశంలో చాలా తీవ్రమైన మార్పులు వచ్చాయి. పేద వారు పేదవారిగా ఉండిపోతున్నారు. ధనవంతులు విపరీతంగా ధనవంతులు అయిపోతున్నారు. ఈ విషయంలో కూడా చంద్ర శేఖర్ గారు చాలా బాధపడే వారు. ఏది ఏమైనప్పటికీ చంద్ర శేఖర్ గారు లేని లోటు ఈ రోజు దేశంలో చాలా కొట్టవచ్చినట్లు కనపడుతోంది. ఏ విషయంలో అయినా సరే వారు నిర్భయంగా, కొట్టవచ్చినట్లు మాట్లాడే స్వభావం గల వ్యక్తి ఆయన. వారితో నాకున్న సాన్నిహిత్యాన్ని తలచుకుంటూ, చంద్రశేఖర్ గారు ఈ దేశ రాజకీయాలలో చిరస్థాయిగా నిలచిపోవాలని కోరుతూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పల్లె రఘునాథ రెడ్డి : అధ్యక్షా, రాజకీయ దురంధరుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, మహోన్నతమైన మానవతా వాది, మాజీ ప్రధాని గౌరవనీయులు, కీర్తిశేషులు శ్రీ చంద్ర శేఖర్ గారి మృతిపట్ల తెలుగు దేశం పార్టీ తరపున నేను తీవ్రమైన సానుభూతిని వ్యక్తం చేస్తూ, గౌరవ ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.

అధ్యక్షా, భరత మాత ప్రసాదించిన అరుదైన అగ్రనాయకులలో చంద్ర శేఖర్ గారు ఒకరు. ఆయన మరణం యావత్ భరత జాతికి తీరని లోటని మనవి చేస్తున్నాను. అంతేగాకుండా, వారిని గురించి చెప్పాలంటే, వారు సాధారణ జీవితం ప్రారంభించారు. అయినా చంద్ర శేఖర్ గారు కృషి, పట్టుదల, కర్తవ్య పరాయణత, దీక్షాదక్షతలు, నిజాయితీ, చిత్త శుద్ధి, అంకిత భావంతో, అహర్నిశలూ కృషి చేసే వ్యక్తి. వారు ఆ విధంగా ఉండి అంచెలంచెలుగా ఎదిగారు. అవిశ్రామంగా పని చేసి ప్రధాన మంత్రి కాగలిగారు. ఆయన ప్రజా సోషలిస్ట్ జనరల్ సెక్రటరీగా, కాంగ్రెసు పార్టీ పార్లమెంట్ జనరల్ సెక్రటరీగా, రాజ్యసభ సభ్యునిగా, పార్లమెంట్ సభ్యునిగా ప్రధాన మంత్రిగా పని చేసినా అత్యంత ప్రతిభా శక్తిసామర్థ్యాలతో పని చేశారు. వారు చేపట్టిన పదవులకు వన్నెతెచ్చారు. పీడితతాడిత ప్రజానీకం, బడుగు బలహీన వర్గాల జీవితాలలో వెలుగులు చిందించాలన్న ఉద్దేశ్యంతో, లక్ష్యంతో, అభిప్రాయంతో ఎల్లప్పుడూ పరితపించేవారు. ఆ విధంగా జాతీయ భావాన్ని అందరిలో పెంపొందించాలనే ఆలోచనలు కలిగిన మహానుభావుడు. ఆయన 1460 కిలో మీటర్ల ప్రయాణం చేశారు. 1460 కిలో మీటర్లు 170 రోజుల పాద యాత్ర సాగించారు. ఆ విధంగా వారు పాదయాత్ర చేసి అరుదైన రికార్డు సాధించారు.

అంతేగాకుండా, వారు ఒక విలక్షణమైన వ్యక్తి . నిరాడంబర జీవి. వారు ప్రధాన మంత్రిగా రాజీనామా చేసినప్పుడు పార్లమెంటు భవనం నుంచి రాష్ట్రపతి భవనానికి నడచి వెళ్లి రాజీనామా లేఖ సమర్పించారు. అంటే ఆయన రాజకీయాలలో ఎంత ఆదర్శప్రాయుడో మనం అంతా ఆలోచన చేయవలసి వుందని మనవి చేస్తున్నాను. అంతేగాకుండా ఆయన కాంగ్రెసు పార్టీలో ఉంటూ 1975 వ సంవత్సరంలో ఎమర్జెన్సీని వ్యతిరేకిచారు. అధికార పార్టీలో ఉంటూ, ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ జైలుకు వెళ్లి అరుదైన రికార్డును సృ ష్టించినటువంటి అరుదైన వ్యక్తిగా ఆయన పేరు చెప్పుకోవచ్చు. వారు అధికార పార్టీలో ఉన్నా, అధిష్టాన వర్గం బలీయం అయినది అయినా తన ఆలోచనలను , భావాలను నిర్మొహమాటంగా, నిర్భీతిగా చెప్పిన ధీశాలి. ధైర్యశాలి.

రాజకీయ జీవితంలో , భారత దేశ చరిత్రలో చాలా అరుదైన వ్యక్తి చంద్ర శేఖర్ గారని సభా ముఖంగా నేను తెలియజేస్తున్నాను. అంతేగాకుండా చంద్ర శేఖర్ గారు ఎల్లప్పుడూ ఏడు సంఖ్య మీద గురి కలిగిన వారు. వారు పుట్టింది 1927 వ సంవత్సరంలో. చనిపోయింది 2007 వ సంవత్సరంలో. 2007 వ సంవత్సరంలో 7 వ నెలలో పోవడం జరిగింది. అది కాకతాళీయం కావచ్చు. ఆయన 80 సంవత్సరాల 7 రోజులు జీవించారు. ఈ సందర్భంలో నేను ఒక శ్లోకాన్ని తమకు గుర్తు చేస్తున్నాను.

" దేహే పాతిని కా రక్షా
యశో రక్ష్య మపాతవత్
నర ః పతిత కాయోపి
యశ ః కాయేన జీవతి "

అన్న ఒక శ్లోకాన్ని చెబుతున్నాను. అంటే , మానవుడు తాత్కాలికమైన, అశాశ్వతమైన, శరీరం రక్షించుకోవడం వల్ల ప్రయోజనం లేదు. శాశ్వతమైనది కీర్తి కాయం . ఆ కాయాన్ని రక్షించుకుంటే ప్రయోజనం ఉంది. భౌతిక కాయాన్ని రక్షించుకుని ప్రయోజనం లేదు. అది చిరకాలం ఉండదు. కీర్తి కాయం

చిరకాలం ఉంటుంది. .  అది  ఆయన పట్ల నూటికి నూరు పాళ్లూ కరెక్టు.  చంద్ర శేఖర్ గారు మన మధ్య లేకపోవడం అన్నది, ఆయన భౌతికంగా మన మధ్యలేరు, ఆయన భౌతిక కాయం నశించినా యశ: కాయం 100 కోట్ల భారత ప్రజల మనసులలో చిరకాలం ఉంటుందని మనవి చేస్తున్నాను.  వారి మరణం పట్ల తీరని లోటును ఎవరూ భర్తీ చేయలేరు.  ఆయన కుటుంబ సభ్యులకు వారి మృతి పట్ల సానుభూతిని , సంతాపాన్ని తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుతున్నాను. చంద్ర శేఖర్ గారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి సిహెచ్. గంగా భవాని : అధ్యక్షా, మాజీ ప్రధాని చంద్ర శేఖర్ గారి మృతి పట్ల ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను.  ఒక మహిళ రాష్ట్రపతిగా అవుతున్న సందర్భంలో , నేను ఒక మహిళగా ఇక్కడ కౌన్సిల్ లో మాట్లాడగల అర్హత కలిగి ఉన్నాను.  అదే విధంగా , సభ్యులంతా సంతాప సభ తీర్మానంలో గంగా భవాని మాట్లాడటం ఏమిటి అనుకుంటున్నారేమో గానీ, నేను ఒక సోషలిస్టు ఫ్యామిలీ నుంచి వచ్చిన దానను.  మా మామగారు 1952 వ సంవత్సరం నల్గొండ జిల్లా నుంచి సోషలిస్టు పార్టీ తరఫున ఎమ్‌పిగా నిలబడటం జరిగింది. వారు  సుండి జగన్నాథం గారు.  అప్పుడు రామనారాయణ రెడ్డి గారు అక్కడ నెగ్గడం జరిగింది.

ఉ.**11.10**

మా మామ గారు సోషలిస్ట్ పార్టీలో వుండే వారు. కాబట్టి చంద్ర శేఖర్ గారి గురించి వినటం, చదవటం తెలుసు నాకు. అంతకుమించి తెలియదు. కాని ఒక మహోన్నత నాయకులని, రాజకీయాల్లో వున్న మా లాంటి వాళ్లకు స్ఫూర్తిదాయకులని, ముఖ్యంగా ఆయన చేసిన పాదయాత్ర ఈ రోజుకీ ప్రజలు జ్ఞాపకం పెట్టుకోవటానికి, 2003లో మా ప్రియతమ ముఖ్య మంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి గారు 48 డిగ్రీల ఉష్ణోగ్రతలో నడటం వెనకాల అట్లాంటి పెద్ద నాయకులు, మహానాయకుల స్ఫూర్తి వుంటుందని, ముందు తరాలకు కూడా అలాంటి పాద యాత్రల వల్ల కష్టసుఖాలు తెలుసుకోవటానికి, ఆ రోజున్న ప్రభుత్వ యొక్క విధానాల పట్ల ప్రజల యొక్క వ్యతిరేకత తెలుసుకొనటానికి ఎంతో తోడ్పడింది. కాబట్టి ప్రజా సమస్యలను, ప్రభుత్వ విధానాల పట్ల ప్రజల వ్యతిరేకతను తెలుసుకొనటానికి అలాంటి పాద యాత్రలు తోడ్పడతాయి.  అవి నిజంగా  స్ఫూర్తిదాయకంగా వుంటాయి.  ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరుస్తూ ఆయన కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

మిస్టర్ చైర్మన్‌: పార్లమెంటులో నాలుగున్నర దశాబ్దాల పాటు ప్రజావాణిని ప్రతిధ్వనింప చేసిన శ్రీ చంద్రశేఖర్ 1927 జూలై 1వ తేదీన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని బలియా జిల్లా ఇబ్రహీంపట్టి గ్రామంలో జన్మించారు.

తన అభిప్రాయాలను నిష్కర్షగా వ్యక్తం చేసే శ్రీ చంద్రశేఖర్ విద్యార్థి దశలోనే సామ్యవాద భావాల పట్ల ఆకర్షితులయ్యారు. సుప్రసిద్ధ సోషలిస్టు నాయకుడు శ్రీ ఆచార్య నరేంద్ర దేవ్ ప్రబోధనలతో ప్రభావితుడై సమసమాజ స్థాపన లక్ష్యంగా రాజకీయ రంగంలో అడుగుపెట్టారు.

1951లో అలహాబాద్ విశ్వవిద్యాలయం నుండి రాజనీతి శాస్త్రంలో ఎం.ఎ. పట్టాను పుచ్చుకున్న శ్రీ చంద్రశేఖర్ ప్రజాసమస్యలనే ఊపిరిగా మలచుకున్నారు.

ప్రజా సోషలిస్టు పార్టీ నాయకుడిగా 1962లో రాజ్యసభ సభ్యునిగా పార్లమెంటులో మొట్టమొదటి సారిగా అడుగుపెట్టారు.

భారతదేశం ఆర్థిక రాజకీయ వ్యవస్థ సామ్యవాద దిశగా వేగంగా అడుగులు వేస్తున్న సమయంలో 1965లో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేశారు.

మితవాద భావాలను నిర్మొహమాటంగా వ్యతిరేకించే శ్రీ చంద్రశేఖర్ అభ్యుదయ భావాల యువ నేతగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందారు.

1970 దశకం ప్రారంభంలో ప్రభుత్వం చేపట్టిన అభ్యుదయ విధానాలను మనస్ఫూర్తిగా సమర్థించిన శ్రీ చంద్రశేఖర్ 1977 నాటి ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలను సమర్థించలేకపోయారు.

అధికార పార్టీలో వుంటూనే అత్యవసర పరిస్థితిని నిర్భయంగా వ్యతిరేకించిన మొట్టమొదటి నేత శ్రీ చంద్రశేఖర్. లోక్ నాయక్ శ్రీ జయప్రకాష్ నారాయణతోపాటుగా దాదాపు రెండు సంవత్సరాలపాటు కారాగార జీవితాన్ని గడిపిన శ్రీ చంద్రశేఖర్ 1977లో జనతాపార్టీ జాతీయ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

1977 నుండి 8 సార్లు బలియా నియోజక వర్గం నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు.

అధికార పార్టీలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ పార్లమెంటులో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువల పట్ల సంప్రదాయాలపట్ల నిబద్ధత కలిగిన నాయకునిగా సభా కార్యక్రమాలు సజావుగా సాగాలని శ్రీ చంద్రశేఖర్ నిరంతరం ఆకాంక్షించేవారు.

సామాన్య ప్రజల ఆరాధ్య నాయకుడైన శ్రీ చంద్రశేఖర్ 1983లో కన్యాకుమారి నుండి న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వరకు 4,260 కి.మీ దూరం కాలినడకన పర్యటించారు.

1990 నవంబర్ 10వ తేదీన భారత దేశ తొమ్మిదవ ప్రధాన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీ చంద్రశేఖర్ ఆరు నెలల పాటు ఆ పదవిలో కొనసాగారు.

1995లో ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డును అందుకున్న శ్రీ చంద్రశేఖర్ భావాలను సరళంగా సూటిగా వ్యక్తీకరించే రచయితగా, జర్నలిస్టుగా కూడా ప్రత్యేక గుర్తింపును పొందారు.

భారత రాజకీయాలలో బహుముఖ ప్రజ్ఞా వంతుడిగా, ఆదర్శవాదిగా అరుదైన గుర్తింపును పొందిన శ్రీ చంద్రశేఖర్ 2007 జూలై 8వ తేదీన తుదిశ్వాస విడిచారు.

ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిముషాలపాటు మౌనం పాటిద్దాం.

**(అనంతరం సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది)**

CHAIRMAN: Now, the House is adjourned to meet again tomorrow at 10.00 AM.

(Then the House adjourned at 11.15 AM to meet again at 10.00 AM on Wednesday, the 18th July, 2007)